# చిన్నారి మనసు

పువ్వాడ గోపాలకృష్ణ



(గత సంచిక తరువాయి)

"నాన్నా! ఆగు" అంటూ భుజంమీదనున్న బాబు అతని చేతిని తన చేతితో ఆపాడు. తల త్రిప్పి చూశాడు సారథి.

"నాన్నా! నాదే తప్పు. పిన్నిని 'అమ్మా!' అని పిలిచాను. ఇంక ఎప్పుడూ అలా పిలువనని చెప్పు"

"ఛీఛీ! చిన్నపిల్లవాడికున్న ఇంగిత జ్ఞానంకూడ లేదు." దుర్గను ఛీత్కారంగా అంటూ కుర్చీమీద ఆసీనుడయ్యాడు.

"బాబూ! నీకు చిన్న సైకిలు కొని ఇస్తానన్నావని, పిన్నిని ఆపివేయ్యాలి"

"నువ్వు ఇప్పుడే సైకిలు కొనితే సైకిలెక్కి ఊరంతా తిరిగి వస్తానోచ్." సంతోషంగా అన్నాడు బాబు.

"దుర్గది ఎంత సంకుచిత స్వభావం. చిన్న పిల్లలే నయం" మనస్సులో అనుకున్నాడు సారథి.

సారథి కొట్టిన దెబ్బలకు దుర్గకు దుఃఖంరాలేదు కాని, కోపంతో కిటికీదగ్గరకు వెళ్ళి బయటవున్న పూలమొక్కలను చూస్తూ మండిపోయింది.

"నాన్నా! ఇవ్వాళ్ళ ..." ఉత్సాహంగా ఏదో చెప్పబోయాడు బాబు.

"ఆపావేం! చెప్పు" అన్నాడు సారథి తన పుత్రుడు చెప్పేది వినాలన్న కుతూహలంతో.

"మరే! మా బడికి ఒక ఇన్‌స్పెక్టరుగారు వచ్చారు. ఆయన చాలా మంచివాడు నాన్నా! ఎంత మంచివాడనంటే...నీ అంత మంచివాడు. ఆయన మా తరగతికి వచ్చి మమ్మల్ని ప్రశ్నలడిగాడు. నేను అన్నీ రైటు చెప్పాను, నన్ను 'వెరీగుడ్' అని మెచ్చుకున్నారు నాన్నా"

"నిజంగానా! అయితే వెరీవెరీగుడ్! ఇంకా బాగా చదువుకోవాలిమరి." అన్నాడు సారథి తన తనయుని తెలివితేటలకు సంతోషించి

"ఓ! చదువుతాను. బాగాచదువుతాను, అందరి కంటే బాగాచదువుతాను." తన ఉత్సాహాన్ని వ్యక్త పరిచాడు బాబు

"బాబూ! నువ్వు పెద్దయిన తరువాత ఏమవు తావు?"

"చెప్పనా!..." బాబు అటూ ఇటూ గుండ్రంగా తన కళ్ళు త్రిప్పి "మరే! డాక్టరునవుతాను." అన్నాడు.

"ఊహూఁ కాదు. నువ్వు ఇంజనీరువు అవ్వాలి!"

"కాదు డాక్టరునే అవుతాను."

"అయితే నీతోటి పలకనుపో!"

"సరే నీ మాటే వింటానాన్నా! నా తోటిపలుకు!"

దుర్గ కిటికీవైపు తిరిగి వున్నదేగాని, వీళ్ళ మాటలు శ్రద్ధగా వింటూనే ఉన్నది.

"బాబూ, నువ్వు పెద్ద అయిన తరువాత ఇంజ నీరువు అవాలి."

సారథి ఈ విషయంలో ఇంత పట్టుదలగా ఉండటానికి కారణం లేకపోలేదు. శాంత, అంటే అతని మొదటి భార్య చచ్చిపోతూ "ఏమండీ! బాబును మీ చేతుల్లో పెడుతున్నాను. వాణ్ని మీ గుండెలలో పెట్టుకొని పెంచండి. వాడికి ఏమాత్రం అన్యాయం జరిగినాసరే, నా ఆత్మకు శాంతి ఉండదు. బాబు పెద్ద ఇంజనీరుకావాలి. ఆ భారం మీ మీద పెడుతున్నాను. ఇదే నా చివరి కోరిక. నా అంతిమ కోరిక నెరవేరుస్తారు కదూ!" అంటూ కన్ను మూసింది

సారథి కను కొలకులలో నీరు నిలిచింది. అందు కనే సారథి తన కొడుకు ఇంజనీరు కావాలని కోరు కుంటున్నాడు.

"నాన్నా!" అన్న పిలుపుతో వాస్తవలోకంలోకి వచ్చాడు.

"నాన్నా! ఏడుస్తున్నారా!" దిక్కుముఖంతో అడిగాడు బాబు

"ఠ! లేదు బాబూ!" కన్నీరు తుడుచుకొని చిరునవ్వు నవ్వాడు.

"నాన్నా!"

"ఊఁ!"

"మరే! నువ్వు చెప్పినట్లుగా పెద్ద ఇంజనీరు నవు తాను. చాలా డబ్బులు సంపాదిస్తాను. అప్పుడు నీకొక మేడ, పిన్నికొక మేడ, చెల్లికొక మేడ కట్టిస్తాను."

"పిన్నికెందుకురా! మంచిదికాదు." రహస్యంగా అన్నాడు సారథి

దుర్గ వాళ్ళసంభాషణను ఆత్రంగా వినసాగింది.

"ఎందుకాదు పిన్ని చాలామంచిది నాన్నా! పిన్నిని ఏమన్నా అంటే మనకు అన్నంపెట్టదు. టిఫిన్ పెట్టదు పిన్ని చాలామంచిదికదూ!" అమాయకంగా అడిగాడు బాబు,

"హారి పెధవా! మంచిదికాదు."

"ఊఁ! మంచిదే."

"సరే!"

ఇదంతా విన్న దుర్గకు కోపం అంతాపోయి. బాబుపై ఎనలేని ప్రేమ పుట్టుకువచ్చింది. ఎనలేని ప్రేమతో బాబువైపు చూసి సారధివైపు చూసింది. సారధి అదేసమయంలో ఆమెను చూశాడు. ఆచూపులలో ఆమె "మాకారా! నాకొడుకంటే ఏమనుకున్నారో! నీకంటే నయం!" అని చదువుకో గలిగింది. వెంటనే తల దించివేసుకుంది.

బాబు పాపను తీసుకొని ప్రక్కగదిలోకి వెళ్ళాడు కారమ్స్ ఆడుకోవడానికి.

సారధికి అప్పటికి గాని గుర్తురాలేదు. తాను దుర్గను కొట్టానని. ఎంతో బాధపడ్డాడు. అనునయిం చాలని లేచాడు.

కాని, ఇంతలో......

"సారధీ, ఒరేయ్ సారధీ!!" అని బయటినుండి కేక వినబడటంతో చటుక్కున ఆగిపోయాడు. దుర్గ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"ఆఁ! ఎవరు?" అంటూ బయటకు వెళ్ళాడు.

ఎదురు గాసుమారు ఐదు అడుగుల ఆరు అంగు ళాల మనిషి!

ఆవ్యక్తిని గుర్తుపట్టలేక పోయాడు సారధి.

ఒరే! ఏమిట్రా? అలా తెల్లమొన్నవేసుకు చూస్తావేం? నేను ఆనందరావుని!' అన్నాడతడు.

'హారి నువ్వట్రా! ఏడుసంవత్సరాలల్లో ఎంత మారిపోయావ్? అరె నిన్ను మంచోటెట్ట మాట్లా డిస్తున్నానే! రా లోపలికిపోదాం" అంటూ కౌగ లించుకొని అతనిని లోపలికి తీసుకువచ్చాడు.

"అబ్బ! ఇంకవదలరా! నా ఎముకలు విరిగి పోతున్నాయ్." నవ్వుతూ అన్నాడు ఆనందరావు.

"ఏడిశావులే" తనుకూడా నవ్వుతూ అతనిని వదలివేసాడు సారధి

"ఆఁ! ఒరే ఈకుర్చీలో కూర్చోరా!" కుర్చీలో కూర్చోబెట్టడు సారధి.

'దుర్గా కాఫీపట్టుకురా" వంటింటివైపు చూస్తూ కేకవేశాడు.

"ఇప్పుడు కాఫీ ఎందుకులేరా? మొహమాటంగా అన్నాడు ఆనంద్.

"తంతాను కాఫీ తీసుకోకపోతే!"

"ఊఁ సరేలేరా! నీతోవచ్చినచిక్కే ఇది, అన్నంత పనీ చేస్తావు"

ఆనందరావు తనకళ్ళలో ఇల్లంతా ఎవరికోసమో వెదికాడు. కాని ఫలితం లేకపోయింది.

ఇంక ఉండబట్టలేక "సారధీ! నీకాంత ఏదిరా? ఈ దుర్గ ఎవరు?" ఆతురతతో అడిగాడు

సారధి ముఖం విషాదంతో నల్లబడిపోయింది. కాంత చనిపోయిన సంగతి, దుర్గను వివాహం చేసుకున్న సంగతి అంతా చెప్పాడు

"ఒరే ఇదంతా నువ్వు ఢిల్లీ వెళ్ళిన తరువాత జరిగింది" అని కన్నీళ్ళు పెడిబాడు.

అతనితోనే ఆనంద్‌కూడా కన్నీళ్ళు తుడుచు కున్నాడు.

"క్షమించు సారధీ! నీ మనస్సు కష్టపెట్టాను."

"ఇందులో క్షమించటానికి ఏముందిరా! మన స్సులో ఉన్న బాధ నీకు చెప్పాను."

"ఆఁ! సారధీ!! అసలుసంగతి మరిచిపోయాను. అప్పుడు రెండేళ్ళ కొడుకు ఉండేవాడు నీకు. నా మనసు వాడిని చూడాలని తొందరపడుతున్నదిరా!"

"ఆఁ! ఉన్నాడు. వాడే నా ఆశాకిరణం. అన్నీ కాంత పోలికలే. వాడిలో చచ్చిపోయిన నా కాంతను చూసుకుంటున్నాను. పిలుస్తానుండు" అంటూ పెద్దగా "బాబూ! బాబూ!! ఇటు రా!!!" అంటూ పిలిచాడు.

"ఆఁ! వస్తున్నా నాన్నా!!" అంటూ హాలులో అడుగు పెట్టిన బాబు ఆనందరావునుచూసి ఆశ్చర్య పోయాడు.

వెంటనే "అరె! మీరా! మా యిల్లు మీ కెలా తెలిసింది? మానాన్న మీకు తెలుసా!" అని అడి గాడు.

"వీడు నాన్నేహితుడురా! నేనెప్పుడూ ఆనంద్ మామయ్యని గురించి చెప్తుతూంటానే వాడే వీడు" అన్నాడు సారధి.

"హాయ్'...ఆనంద్ మామయ్యా!" అంటూ మీదకెగ్రాకాడు.

"ఓరి! వీడట్రా నీ కొడుకు. స్కూల్లో చాలా బుద్ధిగావుంటే బుద్ధిమంతుడనుకున్నాను. అల్లరి వాడేనే"

"అది సరేకాని మువ్వు డి. ఇ. ఓ. అయ్యా వన్నమాట?"

"అవునురా!...ఒక విషయం చెబుతా విను. బాబు ఈజ్ రియల్లీ బ్రిల్లియంట్ బాయ్."

"థాంక్స్!"

"నాన్నా! మామయ్య ఒక్కడే వచ్చాడేం? మరి అత్తయ్య ఏదీ!" అమాయకంగా అడిగాడు బాబు.

"అవునురోయ్ ఆనందం నీ పెళ్ళెప్పుడురా!"

సారిగా నేను పెళ్ళి చేసుకొని ఐదేళ్ళయింది. ఇప్పుడు నేను తండ్రినికూడా! నీకు కోడలేలే! నిన్ను పెళ్ళికి పిలువలేకపోయాను. క్షమించరా."

"ఇంతదానికే అంతబాధపడితావేంరా? రేపే మా చెల్లిని తీసుకురా."

"అవును మామయ్యా! రేపు తప్పకుండా అత్తయ్యను తీసుకురావాలి" ఆసక్తిగా అడిగాడు బాబు.

"ఓ! తప్పకుండా!" అన్నాడు అనంద్.

ఇంతలో టిఫిన్‌ప్లేట్‌తో ప్రత్యక్షమయింది దుర్గ. తల్లికొంగుపట్టుకొనివచ్చింది పాప,

"ఒరే! ఈపాపయేనా నీతనయ!" అడిగాడు ఆనంద్ పాపనుచూస్తూ.

"అవునురా!"

"ఇప్పుడు ఇవన్నీఎందుకురా! కాఫీచాలు గదా."

"ఒరే! నీబెట్టు అపు ఇది నీఅత్తగారిల్లుకాదు" నవ్వాడు సారధి. దుర్గ చిరునవ్వుతో టిఫిన్ టేబుల్‌పై పెట్టింది.

"ఆఁ దుర్గా! మరచిపోయాను. నీదెవరో చెప్ప లేదుకదూ. నేను ఎప్పుడూ ఆనంద్ అనే ప్రాణ మిత్రుడు ఉన్నాడని చెబుతుంటానే...వాడే వీడు." ఆనంద్‌ను దుర్గకు పరిచయంచేశాడు సారధి

"నమస్కారమండీ!" చేతులుజోడించిందిదుర్గ.

"నమస్కారమమ్మా!"

## శంఖారావం

"తా॥ర॥"

శ్రేవండోయ్! రారండోయ్!!
భారత వీరులు లేవండోయ్!!
నవ, భారత పౌరులు రారండోయ్!!
మనభారతిపై మరొక మారుపెను
సమర జ్వాలలు రేగినవోయ్!
విజయమో మరి వీరస్వర్గమో!
తేల్చుకొనగ ప్రజరారండోయ్!
లేవండోయ్!!

పారతంత్ర్య స్వాతంత్ర్యముల నడుమ
సాగెను సంకుల సమరం
పారతంత్ర్యమును పాడుపెట్టి, స్వా
తంత్ర్య జ్యోతికిపట్టంగట్టగ
రారండోయ్!
లేవండోయ్!!

నీతీన్యాయం, సత్యం మనది
దైవం మెచ్చినధర్మం మనది
ఇందిరమ్మ నేతృత్వం మనదోయ్
అందర మొకపై ముందడుగు
వేయరారండోయ్!
లేవండోయ్!

"ధర్మమేవ జయతే నానృత" మును
చిరపై మరియొకమారు బుజావుగా
మనధన తను ప్రాణములనొడ్డి సమ
రాంగణమందున జయము
పొందగా రారండోయ్
లేవండోయ్!

కొంతసేపు ఆగినతరువాత, ఆనంద్ లేస్తూ "ఇక వెళ్ళివస్తానురా! నీ చెల్లెలు ఎదురు చూస్తూ ఉంటుంది" అన్నాడు.

"మామయ్యా! రేపు అత్తయ్యను తీసుకురా!" అన్నాడు బాబు.

"రేపుకాదు వచ్చే ఆదివారం అత్తయ్యను, పాపను తీసుకువస్తాను! టా .. టా !"

"టా... టా..."

"వెళ్ళివస్తాను చెల్లీ!" దుర్గనుచూస్తూ అన్నాడు ఆనందరావు

"చెల్లీ!" అని వినపడేటప్పటికి దుర్గ శరం షణరించిపోయింది. ఇంతవరకు తనను 'చెల్లీ!'

అని పిలిచినవారెవ్వరూ లేరు. కారణం, ఆమెకు ఏ వరుసను కూడ అన్నయ్యలు లేరు. వెంటనే ఆనందంతో "మంచిది అన్నయ్యా!" అన్నది

సారథికికూడ చెప్పి వెళ్ళిపోయాడు ఆనందం!!

* * *

# 5

అర్ధరాత్రి 12 గంటలయింది.

అందరూ గాఢనిద్రలో మునిగివున్నారు.

బయట కుండపోతగా వర్షం పడుతున్నది.

బాబు ఉన్నట్లుండి హటాత్తుగా కలవరించడం మొదలు పెట్టాడు.

"నాన్నా! పిన్నిని కొట్టవద్దు పిన్ని చాలామంచిది ..... పిన్నిని కొట్టవద్దు."

దుర్గ, సారథి ఉలిక్కిపడి లేచారు.

దుర్గ మేలుకొనడం గ్రహించిన సారథి ఏం జరుగుతుందో అని గమనించసాగాడు.

దుర్గ లేచి బాబుదగ్గరకు వెళ్ళింది.

పిచ్చివెధవ వీడిమనస్సు కష్టపెట్టాను' అంటూ నుదుటిపై చుంబించింది.

అంత ప్రేమ అయితే ప్రత్యక్షంగా చూపించరాదూ! వాడిని, నన్ను బాధపెట్టడం ఎందుకు?" సారథి గొంతు వినిపించేటప్పటికి మెల్లిగా, మాట్లాడకుండా తన మంచంపై వెళ్ళిపడుకుంది

"దుర్గా!" అనునయంగా పిలిచాడు సారథి

"... ... ..."

"దుర్గా నిన్నే!!"

"ఊఁ!"

"ఇటురా!"

దుర్గ మెల్లిగా వెళ్ళి అతని మంచం దగ్గర నిలబడింది.

"కూర్చో"

దుర్గ మెల్లిగా మంచంపై కూర్చుంది.

"నన్ను క్షమించండి." అన్నది గద్గద స్వరంతో.

"దుర్గా! వాడు నిన్ను 'అమ్మా' అని పిలవాలని ఉబలాట పడుతుంటే ఎందుకు తిరస్కరిస్తావు"

'క్షమించండి. వాడునన్ను 'అమ్మా' అని పిలవడం నాకు ఇష్టంలేదు అది ఎందుచేతనో నేను చెప్పలేను అలా అని నాకు వాడిపైన ప్రేమ లేకపోలేదు." దుర్గ తలవంచుకొని సమాధానమిచ్చింది.

"సరే ఇంక వెళ్ళు" భారంగా నిట్టూర్చాడు.

దుర్గ మెల్లగా తన మంచం వద్దకు వచ్చేసింది.

* * *

# 6

తూర్పు కొండలలో నుండి భాస్కరుడు క్షణ క్షణ ప్రవర్ధమానుడవుతున్నాడు. సర్వప్రాణులూ అతని కిరణకాంతులలో సంచరిస్తున్నవి ఎవరికి వారు ఆఫీసులకు వెళుతున్నా, సారథి మాత్రం మనస్సు బాగాలేక ఆఫీసుకు సెలవు పెట్టాడు.

బాబు ఎప్పుడో లేచి, స్నానంచేసి, పిన్ని పెట్టిన టిఫిన్ తిని స్కూలుకు బయలుదేరాడు

సారథి కుర్చీలో కూర్చొని పేపరు చదువుకుంటున్నాడు.

"నాన్నా బడికి వెళ్ళివస్తాను. టా టా!" అంటూ ఉత్సాహంగా చెప్పి వెళ్ళాడు పాప అతనిని అనుసరించింది.

సారథి హృదయాన్ని ఏదో తెలియని దిగులు ఆవహించింది.

* * *

బాబు బడికి వెళ్ళేటప్పటికి ఇంటిగంట కొట్టలేదు. పాపని కాను రూమ్‌లో కూర్చోబెట్టి తానుగూడ తన క్లాసుకి వచ్చి కూర్చున్నాడు. అతని మనస్సు ఇప్పుడు నిర్మలంగా, హాయిగా, ఏమి కలతలు లేకుండా నవ్వుతున్నది.

బడికి వచ్చిన పిల్లలంతా ఆడుకుంటున్నారు. తానుకూడ ఉత్సాహంగా ఒక్క గెంతువేశాడు.

కాని, అతనికి అంతలో తన తండ్రి క్రిందటి రాత్రి తాను ఇంజనీరు కావాలని. తాను ఇప్పటి నుంచే బాగా చదవాలని చెప్పినట్లు గుర్తుకు రాగానే రెట్టింపు ఉత్సాహంతో పుస్తకాలదగ్గరకు వెళ్ళి పుస్తకం తీసి చదవడం మొదలు పెట్టాడు

పదిహేను నిముషాలు గడచింది

బడి గంట గణగణమని మ్రోగింది.

పిల్లలంతా ఆటలు మానేసి ఎవరి స్థలాల్లో వారు కూర్చున్నారు.

చదువు ఆపి, బాబు అతని స్నేహితుడు భాస్కర్ ఇంకా రాలేదేమా అని ఆలోచిస్తున్నాడు.

"అదిగో! మాష్టరుగారు వస్తున్నారు." అని పిల్లలు అరవడంతో బాబు తన ఆలోచనా వరదకు వారధి వేశాడు

ఇంతలో టీచర్ నవ్వుముఖంతో లోపలికి ప్రవేశించారు. ఆయన వెంట సిగ్గుపడుతూ భాస్కర్ ప్రవేశించాడు. బాబు వెంటనే అతనిని పరికించి చూశాడు క్రొత్త లాగు, క్రొత్త చొక్కా వేసుకున్నాడు. ముఖంపైన చిరునవ్వు నాట్యం చేస్తున్నది. సిగ్గుతో కొంచెం తలదించుకున్నాడు. ఏదో విశేషముంది అనుకున్నాడు బాబు.

అంతలో మాష్టరుగారు గొంతుసవరించుకొని "ఒరే! అబ్బాయిలూ, వీడు ఎవరో మీకు అందరకూ బాగ తెలుసు ఇవ్వాళ భాస్కర్ పుట్టినరోజు. వీడు ఈ శుభసమయంలో మీకందరకూ మిఠాయిలు పంచి పెడతాడు. అల్లరి చెయ్యకుండా తీసుకోండి" అన్నాడు.

ఇంతలో ఒకతను చేతిలో ఒకబుట్టతో లడ్డూలు వగైరాలు తీసుకొని వచ్చాడు. భాస్కరం అందరికి మిఠాయి పంచాడు.

ఇక ఆరోజుకు శలవు వచ్చింది

బడిలో అందరూ వెళ్ళిపోయారు. కాని భాస్కరం, బాబు, పాప మాత్రం వున్నారు. భాస్కరం టీచరు ఏదో చెబుతుంటే ఆయనదగ్గర వున్నాడు. బాబు, పాప స్కూలు బయట అతని కోసం కాచుకు కూర్చున్నారు.

"పుట్టినరోజు పండుగ అని నాకు మాటవరుస నన్నా చెప్పలేదే!" అని ఆలోచించసాగాడు బాబు.

ఇంతలో నవ్వుతూ బయటకువచ్చాడు భాస్కర్.

బాబు వాడిచెయ్యి పట్టుకొని "ఏరా? ఇవాళ్ళ నీపుట్టినరోజు పండుగ అని చెప్పలేదేం?" అని అడిగాడు.

"నాకుకూడా తెలియదురా, నిన్న సాయంకాలమే మా అమ్మ చెప్పింది, అయినా నీకు చెప్పాలని ఎక్కడుంది!' భాస్కర్ మాటలలో గర్వం తొణుకిసలాడింది.

బాబు లోలోపల కొంచెం బాధపడ్డాడు.

'ఒరే! చూశావా! మా అమ్మ ఎన్నిలడ్డూలు చేసిందో మీపిన్ని చెయ్యదుగా" హేళనగా అడిగాడు భాస్కరం.

"మేము ఇంట్లోనే చేసుకుంటాము అయినా మా అమ్మ లేదుగా. మాఅమ్మ గనక ఉంటే మీ అమ్మ కన్నా బాగా చేస్తుంది."

"ఏం చెయ్యదు."

"చేస్తుంది."

"చెయ్యదు."

"చేస్తుంది."

"మీ అమ్మ చచ్చిపోయిందిగా. ఇంక ఎట్లా చేస్తుంది?

"అయినాసరే. చేస్తుంది."

"చెయ్యదు."

"చెయ్యదు, చెయ్యదు" అని భాస్కర్ అనేటప్పటికి బాబుకు కోపం ఏడుపు వచ్చినయ్. ఏడుపును దిగమింగి కోపంతో భాస్కర్ ముక్కుమీద బలంగా గుద్దాడు.

'అమ్మా' అంటూ కూలబడి ఏడవసాగాడు భాస్కర్

వాడు ఏడవడం మొదలు పెట్టేటప్పటికి బాబు కూడా ఏడవడం మొదలు పెట్టాడు ఏడ్చుకుంటూ ఇంటికి పరిగెత్తాడు.

ఇంటికి ఏడుస్తూవచ్చిన కొడుకును గేటుదగ్గరే అమాంతం ఎత్తుకొని వచ్చాడు సారథి

వాడి ఏడుపును చూసి ఏదో జరిగిందని అనుకున్నాడు సారథి.

"బాబూ! ఏం జరిగింది? నిన్నుఎవరుకొట్టారు?" గాభరాగా అడిగాడు.

"చూడునాన్నా అమ్మ చెయ్యదుట.' వెక్కిళ్ళ మధ్య అన్నాడు బాబు

సారథి అయోమయంగా పాపవైపు చూశాడు.

పాప బడిలో జరిగిన ఉదంతం అంతాచెప్పింది.

ఆ అబ్బాయికి దెబ్బఏమన్నా తగిలిందేమోనని భయపడ్డాడు సారథి

"బాబూ వాళ్ళ నాన్నగారి పేరేమిటి?"

"శ్రీనివాసరావుగారు నాన్నా!" ఏడుపు ఆపుతూ అన్నాడు బాబు.

అదిరిపడ్డాడు సారథి శ్రీనివాసరావుగారంటే తన ఆఫీసులో హెడ్‌క్లర్కు కాదుకదా!

"బాబూ నువ్వు అట్లా కొట్టవచ్చా! వాళ్ళ యింటికి వెళదాం పద." అని సైకిలుమీద బయలుదేరాడు.

సారథి శ్రీనివాసరావు గారింటికి వెళ్ళేటప్పటికి భాస్కర్ అతని ఒడిలో కూర్చొని ఏడుస్తున్నాడు. అతని ఎదురుగా అతని శ్రీమతిగారు నిలుచుంది. ఆయన 'ఇంక ఏడుపు మానేసెయ్ నాన్నా!' అని కొడుకును సముదాయిస్తున్నాడు.

సారథి 'ఏమండీ!" అని పిలవడంతో ఇద్దరూ

తలెత్తిచూశారు. శ్రీనివాసరావు గారి శ్రీమతి లోపలికి వెళ్ళిపోయింది ఆయన ఎదురుగా ముద్దాయి లాగా నుంచున్నాడు సారథి

"అరె! సారథి గారా! అలాగే నిలబడి పోయేరేం, లోపలకు రండి" అంటూ కుర్చీచూపించాడు.

సారథి లోపలికి వస్తూ "నన్ను క్షమించండి. మా బాబు మీ భాస్కర్‌ను కొట్టాడు వాడి తరుపున మిమ్మల్ని క్షమాపణ వేడుకుంటున్నాను." అన్నాడు.

"అరె! దీనిలో క్షమాపణ కోరు కోవడానికి ఏమున్నదండీ. వాళ్ళు చిన్న పిల్లలు ఆడుకున్నంత సేపు ఆడుకుంటారు, కొట్టుకుంటారు. వెంటనే మళ్ళీ ఆడుకుంటారు." చిరునవ్వుతో అన్నాడు శ్రీనివాసరావు

అతని విశాలహృదయానికి మనస్సులోనే హృదయాంజలి సమర్పించాడు సారథి.

శ్రీనివాసరావు తండ్రి వెనుక నిలబడి తనని తొంగితొంగి చూస్తున్న బాబును చూచి దగ్గరకు వెళ్ళి చెయ్యి పట్టుకొని "బాబూ! నీ పేరేమిటి?" అని ప్రేమగా అడిగాడు.

బాబు బిక్కముఖం వేసి సారథివైపు చూశాడు.

"చెప్పుబాబూ భయంలేదులే."

"గో.. పి..." ముద్దుగా తలవంచుకొని సమాధానమిచ్చాడు బాబు.

వెరీగుడ్ భుజంతట్టాడు శ్రీనివాసరావు.

బాబు భాస్కర్ దగ్గరకువెళ్ళి, వాడి చెయ్యి పట్టుకొని, "ఒరే నేను తప్పుచేశానురా. ఇంకెప్పుడూ నిన్ను కొట్టనురా కావాలంటే నువ్వుకూడా నన్ను గుద్దు." అని భాస్కర్ చేతిని తనముక్కుపై పెట్టి గుద్దమన్నట్లుగా చూసాడు

భాస్కర్ నవ్వుతూ చెయ్యి విడిపించుకొని, "ఫరవాలేదులేరా. అది సరేగాని, నా దగ్గర పెద్ద బంతి ఉన్నది ఆడుకుందాం వస్తావా" అన్నాడు.

"ఓ" ఎగిరి గంతువేశాడు బాబు

బంతి తీసుకురావటానికి లోపలికి వెళ్ళాడు భాస్కర్.

"బాబూ!" అన్న పిలుపులో తండ్రిదగ్గరకు వెళ్ళాడు బాబు

భాస్కర్ పుట్టినరోజుగదా ఇదిగో...ఈబొమ్మ ఇవ్వు" అంటూ ఒకబొమ్మను అతనిచేతులో పెట్టాడు

"ఇవన్నీ ఇప్పుడెందుకండీ!" మొహమాటంగా అన్నాడు శ్రీనివాసరావు

దానికేముందిలెండి ఏదో పుట్టినరోజుకానుక" అన్నాడు సారథి

ఇంతలో భాస్కర్ బంతి తీసుకొని బయటకు వచ్చాడు

ఒరే! ఇదిగోరా! నీపుట్టినరోజు కానుక" అంటూ బొమ్మను ఇచ్చాడు బాబు.

నవ్వుతూ దానిని తీసుకొని పరిశీలనగాచూశాడు భాస్కర్

కృష్ణుడు తన సుందరమైన పిల్లనగ్రోవితో మధురంగా, మనోహరంగా గానం చేస్తున్నాడు. అతని భుజంపై రాధ చేతులువేసి, అరమోడ్పు కన్నులతో ముగ్ధయై అతనివైపు చూస్తూ అతని మనోహరమైన, వీనులకు విందునిచ్చే మురళీగాన వాహిని వింటూ తన్మయత్వంతో పరవశురాలవుతున్నది.

"అబ్బ! ఎంతబాగుందీబొమ్మ!" అనుకున్న భాస్కర్ వెంటనే నాన్నదగ్గరకు పరుగెత్తి "నాన్నగారూ! ఈ బొమ్మ చాలా బాగున్నది కదూ!" అన్నాడు.

"బాగుందా! అయితే మామయ్యగారికి థాంక్స్ చెప్పు"

"థాంక్స్ మామయ్యగారు!"

"అబ్బా! అబ్బా!" అన్నాడు సారథి నవ్వుతూ

"శ్రీనివాసరావుగారూ! ఇంక నేను వెళ్ళివస్తానండీ!" అంటూ బయలు దేరాడు సారథి.

"ఉండండి" అంటూ అతనికి, బాబుకు ఉపాహారం పెట్టించాడు శ్రీనివాసరావు

* *

ఇంటికి వెళ్ళిన తరువాత సారథి బాబుకు ఇలా హితబోధ చేశాడు.

బాబూ! అలా అందరినీ కొట్టవచ్చా. భాస్కర్ వాళ్ళ నాన్నగారు చాలా మంచివారు కాబట్టి నిన్ను ఆయన కొట్టలేదు మరి అందరూ అలాఉండరుగా. ఇంకొకళ్ళయితే నిన్నుకొడతారు." భయంభయంగా చూశాడు బాబు

కొంతసేపయిన తరువాత బాబు సారథితో ఇలా అన్నాడు.

"నాన్నా! స్కూల్లో అందరూ నన్ను 'మీ అమ్మ చచ్చిపోయింది, నీకు అమ్మ లేదు' అని ఎగతాళి చేస్తున్నారు. మరి వాళ్ళను కొట్టవద్దు"

సారథి హృదయం కలుక్కుమన్నది.

"అలా చెయ్యకూడదు. ఎగతాళి చేస్తే మాష్టరు గారితో చెప్పు. లేకపోతే దేవుడే వాళ్ళను కొడతాడులే. నువ్వు మాత్రం కొట్టకూడదు. అయినా, అమ్మ చచ్చిపోతేనేం? అమ్మ ఫొటో ఉన్నదిగా. అది నీకిస్తాను ఏం?" అంటూ సారథి తానుఎన్నాళ్ళనుంచో దాచుకున్న శాంత ఫొటో ఇచ్చాడు.

"హాయ్! హాయ్. అమ్మ! ఇదిగో అమ్మ!" అని ఎగురుకుంటూ ఆనందంగా బయటకువెళ్ళాడు.

ఇదిచూసిన సారథి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

ఇంతలో దుర్గ రావటంచూసి బాబుగా కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

* * *

## 8

అమ్మ ఫొటో చేతిలోకి వచ్చినప్పటినుంచి బాబు ఆనందం అవధులు దాటింది. ఒక విధంగా చెప్పాలంటే వాడికి అదే లోకమయింది. ఎప్పుడు చూసినా సరే వాడికి అదే లోకమయింది. ఎప్పుడు చూసినా సరే వాడి జేబులోఆ ఫొటో ఉంటుంది. ఎప్పుడూ దానివైపేచూస్తూ ఆలోచిస్తూ ఉంటాడు. ఇదివరకులాగ పాపతో ఆడుకోటం మానేశాడు. సారథితో చాలాతక్కువగా మాట్లాడేవాడు. అందరికి "ఇదిగో మీ అమ్మ ... ఇదిగో మాఅమ్మ." అని ఫొటోచూపిస్తూ అనేవాడు ... పిల్లలందరూ ఎగతాళి చేయడం మొదలు పెట్టారు. వాళ్ళమాష్టర్లు సారథిని ఒకటి రెండు సార్లు "మీవాడు పాఠాలు సరిగ్గా చదవడం లేదండీ, క్లాసులో మతిమరుపు ఎక్కువవుతున్నది." అని హెచ్చరించారు. ఇదంతా కనీ, వింటున్న సారథికి బాబు పట్ల దిగులు హెచ్చింది.

"బాబు! ఆ ఫొటోనే చూస్తూ పిచ్చివాడై పోతాడేమో! లేకపోతే... ఆ ఫొటోను బాబు దగ్గర నుండి తీసివేస్తే?... అమ్మో... ఇంకేముంది! వాడిహృదయం ముక్కలై పోతుంది. మరలా అతికించడం కష్టం." అని బాధపడటం మొదలు పెట్టాడు. బాహ్యంగా బాబుపైన ప్రేమ చూపించలేని దుర్గకూడ లోలోపల బాధపడసాగింది. బాబు రోజు రోజుకు చిక్కిపోతున్నాడు, చుట్టుపక్కల అమ్మలక్కలు అందరూ దుర్గను మీ "బాబు అలా చిక్కిపోతున్నాడేమని" అడగడం మొదలు పెట్టారు. బాబు తరచుగా నిద్రలో "అమ్మా!" అని కలవరించడం కూడా చేస్తున్నాడు.

ఆ రోజు ఆదివారం. సారథి షేవ్ చేసుకుంటున్నాడు, బాబు ఏదో పుస్తకాన్ని చదవటానికి ఉద్యుక్తుడవ బోతున్నాడు. కాని వాడి మనసు మాత్రం అక్కడ లేదు.

"బాబూ!" అన్న పిలుపులో ఈ లోకంలోకి ఊడి పడ్డాడు.

"ఊఁ!" మెల్లిగా అన్నాడు.

"ఇలా రా!" సారథి పిలిచాడు.

బాబు లేచి వెళ్ళి తండ్రి దగ్గర కూర్చున్నాడు.

"ఇవాళ ఎవరు వస్తారో చెప్పుకో."

"ఏమో నాకు తెలియదు."

సారథికి ఆశ్చర్యం వేసింది నాలుగు రోజుల క్రిందటి సంగతి అప్పుడే మరచి పోయాడు బాబు

"గుర్తు తెచ్చుకో."

"ఊహుఁ. నాకు గుర్తు రావటంలేదు"

"ఇవాళ ఆనందం మామయ్య మనింటికి వస్తానని చెప్పలా?"

"అవును గుర్తుకు వచ్చింది." అంటూ లేచి వెళ్ళిపోయాడు బాబు

9 గంటలకు భార్యా, తనయా సమేతుడై వచ్చాడు ఆనందరావు. అందరూ ఆరోజున ఉత్సాహంగా వున్నారు. బాబు అప్పుడు కూడ అమ్మ ఫొటో చేతిలో పెట్టుకొని తిరుగుతున్నాడు.

12 గంటలకు భోజనాలు చేసి సారథి, ఆనందం వారివారి శ్రీమతులతో సహా కారమ్స్ ఆడటానికి కూర్చున్నారు.

ఇంతలోకి బాబు ఎక్కడినుంచో వచ్చి, తండ్రి భుజంలాగి, "నాన్నా! మరి చచ్చిపోయిన వాళ్ళు ఎక్కడవుంటారు" అని అడిగాడు.

"స్వర్గంలో" గతుక్కు మంటూ సమాధానమిచ్చాడు సారథి

"మరి అమ్మకూడా అక్కడుంటుందా?"

సారథి ముఖం విషాదంతో నల్లబడిపోయింది.

"ఓ! తప్పకుండా!" అని సమాధానమిచ్చాడు.

"నాన్నా! అమ్మను స్వర్గంనుండి ఇక్కడకు రమ్మనవా! నాకు అమ్మను చూడాలని ఉన్నది." పిచ్చి పిచ్చిగా అడిగాడు బాబు.

ఎలా వస్తుంది బాబూ! అది చాలా దూరం."

సారథి గొంతులో కంగారు అధికమయింది.

"అయితేమాస్లే టెలిఫోనులో మాట్లాడు"

"టెలిఫోను అక్కడిదాకా వెళ్ళదుబాబూ!"

"ఊహుఁ అలా వీల్లేదు. నాకు అమ్మను చూడాలి

ఉన్నది. నేనుకూడా స్వర్గానికి వెళతున్నాను." అంటూ బయటకు పరుగెత్తటం మొదలు పెట్టాడు.

'బాబూ' అంటూ ఒక్క ఉదుటున లేచాడు. సారథి.

వాడివెంట పరుగెత్తుకు వెళ్ళి వాణ్ణి పట్టుకొని ఎత్తుకొని హృదయానికి హత్తుకున్నాడు. అతని కనులనుండి కన్నీటి ధార వరదలుగా రాసాగింది.

ఆనంద్, అతని శ్రీమతి తెల్లబోయి సారథి వైపు, బాబు వైపు చూస్తున్నారు. దుర్గ మాత్రం తలదించుకొనే ఉన్నది. ఆనంద్ సగం తెలిసి, సగం తెలియని పరిస్థితిలో ఉన్నాడు అతని శ్రీమతి ఏమి తెలియక అయోమయంగా చూడసాగింది

"చెల్లీ! నేను, సారథి అలా పార్కుకు వెళ్ళి వస్తాముకాని, బాబు బయటకు వెళ్ళకుండా చూడు' ఆనంద్ దుర్గ నుద్దేశించి అని సారథిని పార్కుకు తీసుకువెళ్ళాడు.

అక్కడ 'అసలు ఏం జరిగిందిరా?" మెల్లిగా అడిగాడు ఆనంద్.

సారథి అంతా వివరించి చెప్పి ఇలా వాపోయాడు. "ఒరే! బాబు రోజురోజుకూ పిచ్చివాడై పోతున్నాడు. వాడికి ఏమన్నా అయితే నేనుమాత్రం బ్రతుకలేనురా. వాడికి అన్యాయం జరిగితే నా ఆత్మకు శాంతి ఉండదు." సారథి ఏడుస్తూ ఆనంద్ ను కౌగిలించుకున్నాడు.

ఆనంద్ సారథిని అనునయించాడు.

కొంతసేపయిన తరువాత ఇద్దరూ ఇంటి ముఖం పట్టారు.

* * *

ఇద్దరూ ఇంటికి చేరుకునేటప్పటికి బాబు ఎందుకో ఏడుస్తున్నాడు. దుర్గమాత్రం దగ్గరలేదు. ఆనంద్ శ్రీమతి వాడిని బుజ్జగిస్తున్నది.

'బాబూ ఎందుకురా ఏడుస్తున్నావు' గద్గద స్వరంతో అడిగాడు సారథి వాడిని అక్కున చేర్చుకుంటూ

బాబు నోటినుండి దుఃఖస్వరం తప్ప ఏమి సమాధానం రాలేదు.

"వాళ్ళ అమ్మ ఫోటో ఎక్కడో పోయిందట. అందుకు ఏడుస్తున్నాడు" ఆనంద్ శ్రీమతి సమాధాన మిచ్చింది

"ఇప్పటివరకు బాబు దగ్గర ఉన్న ఫోటో ఇంతలోనే ఎలా మాయమైపోతుంది దాన్ని ఎవరో దాచివుండాలి. ఇదితప్పకుండా దుర్గపనైవుంటుంది, అని తలచిన సారథిముఖం కోపంతో కందగడ్డలా అయింది. పళ్ళుపటపట కొరుకుతూ "దుర్గా" అని అరుస్తూ ఆమెవున్న గదిలోకి వెళ్ళాడు. దుర్గ కిటికీలోనుంచి బయటకు చూస్తున్నదల్లా అతడి అరుపును విని ఉలిక్కిపడి వెనుకకు తిరిగింది. ద్వారందగ్గర ఉన్నసారథి క్రమక్రమంగా అడుగులో అడుగువేసుకుంటూ తనదగ్గరకువస్తున్నాడు అతడికళ్ళల్లోనుండి నిప్పుకణికలు రాలుతున్నవి. దుర్గకొంచెం భయపడ్డది.

"ఏమిటండీ?" పైకి ధైర్యంగా అడిగింది.

"ఫోటో ఏమయింది?" సారథి కఠినంగా ప్రశ్నించాడు.

"ఏ ఫోటో?"

"శాంత ఫోటో."

"నాకు తెలియదు."

"తెలియదా?"

"ఊహూఁ తెలియదు."

'నిజం చెప్పు"

"నిజమే చెపుతున్నాను"

"అహాఁ అలాగేం? అలాగే ఉండు. కొంచెం నిదితపూజ జరిగితేనేకాని, నిజం బయటపడదు." అంటూ బయటకువచ్చి పెద్దకర్రను తీసుకొని గదిలోకి వెళ్ళసాగాడు సారథి

"సారథీ, ఆగరా" ఆనంద్ అతనిచెయ్యి పట్టుకున్నాడు.

ఆ చేతిని విదిలికొట్టి సారథి గబగబా గదిలోకి వెళ్ళి గడి బిగించాడు. బాబు ఎప్పుడు ఆ గదిలోకి దూరాడో ఎవ్వరూ చూడలేదు.

మర్యాదగా ఇప్పుడిన్నా చెప్పు ఆ ఫోటో ఎక్కడ పెట్టావు?" సారథి కంఠం ఖంగుమన్నది.

'నాకు తెలియదంటే ఏమిటండీ? నా మాట నమ్మరేం? గద్గద స్వరంతో అన్నది దుర్గ.

"అలాగా." అంటూ సారథి ఆవేశంతో దుర్గను ఇష్టమొచ్చినట్లు బాదాడు. దుర్గమాత్రం కళ్ళ నీళ్ళు కార్చిందేకాని కిక్కురు మనలేదు.

'నాన్నా! ఆగు' అన్న బాబు కేకకూడా వినపడలేదతనికి. బాబు ఒక్క ఉదుటన వెళ్ళి దుర్గను వాటేసుకున్నాడు

మరుక్షణంలో బాబు "అమ్మా!" అంటూ సారథి కాళ్ళ దగ్గర పడిపోయాడు. సారథి ఉలిక్కిపడి క్రిందకు చూశాడు.

బాబు స్పృహ లేకుండా పడిపోయి వున్నాడు. వెంటనే కర్ర అవతల పారవేశాడు. బాబును ఎత్తుకు చూశాడు. బాబునుదిటిపై బలమైన గాయం; ఆ గాయంనుండి రక్తం వరదలై సాగుతున్నది.

"బాబూ!" ఆత్రంగా కేకలు ఒక్కసారే దుర్గ, సారథి నోళ్ళనుండి వచ్చినై. దుర్గ గబగబా చీరెచించి గాయానికి కట్టుకట్టింది సారథి ఏడుస్తూ గదితలుపులు తెరచి ఎదురుగా, లోపలఏమి జరుగుతున్నదా అని ఆదుర్దాలో ఉన్న ఆనంద్ ను కౌగలించుకొని

"ఒరే నాబాబు...నాబాబు...'అని దుఃఖించడం మొదలు పెట్టాడు.

ఆనంద్ గబగబా బాబుదగ్గరకు వెళ్ళాడు; దుర్గ అక్కడ కూర్చొని ఏడుస్తున్నది.

"నేను వెంటనే డాక్టరును పిలుచుకువస్తాను." అంటూ బయటకు పరుగెత్తాడు ఆనంద్.

దుర్గ వంటయింట్లోకివెళ్ళి చల్లనినీరు తెచ్చింది. అందరూకలసి బాబును బెడ్ పై పడుకోబెట్టారు. కొంచెంసేపటి బాబు ముఖంపై చల్లారు.

'నాన్నా!' అంటూ మెల్లగా కదిలాడు బాబు

"బాబూ! నేను ఇక్కడే ఉన్నాను." ఆత్రంగా కన్నీ తుడుచుకుంటూ అన్నాడు సారథి.

ఇంతలో డాక్టర్ తో సహా ఆనంద్ వచ్చాడు.

డాక్టర్, బాబు పూర్తిగా తేరుకునేటట్లు చేశాడు, గాయంవద్ద కట్టుకట్టి ఇంక భయవాలేదని చెప్పి వెళ్ళిపోయాడు

బాబు సారథి వడిలో తల పెట్టుకొని, "నాన్నా ఇంకెప్పుడూ పిన్నిని కొట్టవుగదూ?" అడిగాడు.

తనని ఇంతగా ప్రేమిస్తున్న,వాడిపై దుర్గకంత ద్వేష మెందుకో సారథికి అర్థం కాలేదు.

"అలాగే బాబూ! ఇంకెప్పుడూ పిన్నిని కొట్టనులే నీమీద ఒట్టు!!" అతని జుట్టులోకి ప్రేమగా వేళ్ళు పోనిస్తూ అన్నాడు సారథి

ఇదంతా వింటున్న దుర్గ కన్నీటికి అంతులేక పోయింది.

బాబు లేచి పిన్నిదగ్గరకు వెళ్ళి "పిన్నీ! నాన్న ఇంకెప్పుడూ నిన్ను కొట్టడుటలే ఏడుపు మానేసి వెయ్యి అన్నాడు.

దుర్గ వెంటనే ప్రేమగా "బాబూ." అంటూ వాడిని హృదయానికి హత్తుకుంది.

"పిన్నీ!" అంటూ ఆమె కన్నీటిని తుడిచాడు బాబు.

వద్దు బాబూ నువ్వునన్ను ఇకనుంచి అమ్మా అని పిలువు."

"పిరే?"

ఏదీ ..ఒక్కసారి పిలువు"

"అమ్మా!" ముద్దుగా పిలిచాడు బాబు.

"బాబూ" అంటూ గట్టిగా గుండెలకు హత్తుకుంది బాబును

"అమ్మా" మరోసారి పిలిచాడు బాబు.

ఇంతలో పాప దగ్గరకు రావటంతో పాపను కూడా దగ్గరకు తీసుకొని దుర్గ సారథితో 'ఏమండి మీ మీద ప్రమాణంచేసి చెబుతున్నాను. ఇప్పటిదాకా పాప ఒక్కతే నా బిడ్డ అనుకునేదాన్ని. కాని ఇకనుంచీ నాకు ఇద్దరు బిడ్డలు. బాబుకు నేను కన్న తల్లిని కాకపోయినా వాడు నాబిడ్డే' అంటూ ఇద్దరిని ముద్దుపెట్టుకున్నది.

తన భార్యలో వచ్చిన మార్పుకు సారథి కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలినై.

"ఏమండీ! ఏడుస్తున్నారా?' ఆత్రంగా అతని కళ్ళల్లోకి చూసింది దుర్గ.

"లేదు దుర్గా, ఇవి ఆనందబాష్పాలు. ఇకనుంచీ నా మనస్సు హాయిగా ఉంటుంది." చిరునవ్వు నవ్వాడు సారథి.

"ఏమండీ; నన్ను క్షమించండి." తల వంచుకొని దీనంగా అడిగింది దుర్గ.

"నిన్ను క్షమించడ మెందుకు దుర్గా?"

"అవును మీరు నన్ను క్షమించాలి బాబు అక్కయ్య ఫోటోనుచూసి రోజు రోజుకూ పిచ్చివాడై పోవడంచూసి సహించలేక నేనే ఆ ఫోటోను దాచాను. నన్ను క్షమించండి".

"ఆ మాటకువస్తే నువ్వే నన్ను మన్నించాలి దుర్గా! నువ్వు లోలోపల బాబును ప్రేమిస్తున్నా, అది గ్రహించలేక నిన్ను గొడ్డును బాదినట్లు బాదాను' బాధగా పలికాడు సారథి.

'ఇద్దరిలో ఎవ్వరిదీ తప్పులేదు. అమ్మ నాన్న ఇద్దరూ మంచివాళ్ళే" అన్నాడు బాబు వాళ్ళ మధ్యకు వచ్చి

"పిల్లలూ, దేవుడూ చల్లనివారే ... మెరుగని కరుణా మయులే .." ...గా పాట వినిపించింది.

"అవును పిల్లల హృదయాలు దేవునితో సమానం" గంభీరంగా అన్నాడు సారథి

అందరి ముఖాల్లోనూ దరహాసాలు వెల్లి విరిశాయి.

[సమాప్తం]